



కందాళ కూర్మనాథం

వెంకటశాస్త్రి కోర్టు పనిమీద రాజమండ్రి వచ్చాడు ఒకరోజున. ఆ సాయంత్రం హఠాత్తుగ వెలిగిన దీపాలు చూసి ఆశ్చర్యపోయాడు శాస్త్రి. ఈదీపాలు తుడవక్కరలేదు, చమురు పోయక్కరలేదు, గాలిలో ఆరిపోవు, చాల కాంతిగా ఉంటాయి, బాగా ఉన్నా యనుకొన్నాడు. వాళ్ళ ఊళ్లోకూడా ఇవి పెట్టించి వాటి కాంతిలో సుఖం అనుభవిద్దాం అని ఆశ పుట్టింది. తక్షణం ఎలక్ట్రిక్ కార్పొరేషనుకి వెళ్ళి మాట్లాడాడు. రాజమండ్రినుంచి ధవిళేశ్వరానికి ఊళ్లోను, శాస్త్రి యింట్లోను స్తంభాలు పాతి తీగలు పాకించారు. పురవాసు లంతా దీపాలు వస్తాయని వాటిని చూద్దామని ఉవ్విళ్లూరుతూ స్వాతివానకు ఎదురు చూస్తున్న ముత్యపు చిప్పలవలె ఎదురు చూస్తున్నారు. రోడ్లమీద ప్రతి స్తంభానికి ఒక్కొక్క బుడ్డి తగిలించారు. శాస్త్రిగారి ఇల్లంతా ప్రతి గజానికి ఒక బుడ్డి చొప్పున వంద ఓల్టులు గల బుడ్లు ప్రతి గదికి ఒక విసనకర్ర పెట్టి అమర్చారు. దీపాలు వెలిగించడానికి అమావాస్య మంగళవారం రాత్రి పదిగంటలకి ముహూర్తం. అమావాస్యనాడు చాల చీకటిగా ఉంటుంది. మిగతా రోజులు వెన్నెల ఉంటుంది. అందుచేత దీపాలు రాత్రి అంతా వెలిగిస్తే బాగుండదు. అమావాస్యనాడు రాత్రి అంతా వెలిగించచ్చు అని ఆ ముహూర్తం పెట్టారు. పల్లెటూళ్లనుంచి కూడా వచ్చారు జనం తండోప తండాలుగ చూడ్డానికి దీపాలని. దీపాలను వెలిగించారు. ఊరంతా రాజు పట్టణంలాగ వెల్గుతోంది. నక్షత్రాల మధ్య చంద్రుడులాగ ఉంది శాస్త్రిగారి భవనం ఆ దీపాలలో. అందరు వినోదంగా సంతోషంతో కన్నుల పండువుగ తనివిదీర దీపాలు చూస్తున్నారు. సూర్యోదయందాకా వెలిగించారు దీపాల మీద సరదా చేత. రెండోనాడు రాత్రికూడ మూగారు జనం చోద్యం చూడ్డానికి. ఆ నాడు గాలివాన ఒచ్చింది రాజమండ్రిలో. కర్రెంటు చాలా దూరంనుంచి రావడంచేత తీగలు గాలికి అల్లల్లాడి ఆరిపోయాయి దీపాలు. ఇల్లాగ ఏ డెనిమిదిసార్లు ఆరిపోయాయి దీపాలు. "ఆరి బాబోయి! ఇవి కొరివి దయ్యాలురా, ఇవి కొరివిదయ్యాలు! కాకపోతే ఇక్కడ కొంతసేపు అక్కడ కొంతసేపు మంటలు వేసినట్టుగా ఆరిపోను వెలగను ఆరిపోను అవుతాయి!" అని అందరు హడిలిపోయి ఇళ్ళల్లోకి దూరి గట్టిగ తలుపులు వేసి,



ఒకవేళ తలుపులు తోసి లోపలికి వస్తాయన్న భయంచేత తలుపులుకి అడ్డంగా బరువుపెట్టి, ఒకర్ని ఒకరు కాగలించుకొని సూర్యోదయం దాకా పడుక్కున్నారు. తెల్లవారగానే దయ్యాల శక్తి పోతుంది. అవి అప్పుడు మనుష్యుల్ని ఏమి చెయ్యవు అనే ధైర్యంచేత అందరు లేచి శాస్త్రి గారిమీదకు దండెత్తారు. "ఈ యూరులో కొరివి దయ్యాల్ని ప్రవేశ పెట్టారా? యిక ముందు బ్రతకనియ్యవు మమ్మల్ని అవి. వాటిని పంపి వేస్తారా లేకపోతే మీకు బడితె బాజా చెయ్యమంటారా?" అని భయపెట్టారు శాస్త్రి గారిని. ఆయన ఎన్ని చెప్పినా వినలే వాళ్లు. ఆఖరికి 'ఏటిని తీగెలతో కట్టేస్తాను. మిమ్మల్ని అవి ఏమి చెయ్యవు. అవి సాధువైనవి. మీ కేమి భయం లేదు' అని సమాధానం చెప్పాడు శాస్త్రి వాళ్లకి. ఇల్లా నెల గడిచింది. నెల రోజులు వెలిగాయి దీపాలు ఎడ తెగకుండ రాత్రి పన్నెండు గంటలు.

ఒకరోజున ఒక పల్లెటూరు మనిషి ఆ వీధిలోంచే వెడుతున్నాడు. ప్రభుత్వంవారు అగ్గిపెట్టెలు తప్ప చెకుముకిరాళ్లుగాని పెట్రోలు టార్చిలుగాని వాడితే లైసెన్సు ఉండాలన్నారు. లేకపోతే జుల్మానా అన్నారు. చాలామంది బీదవాళ్లుంటారు, వాళ్లు అగ్గిపెట్టలు కొనుక్కో లేరు అని ఆలోచించారా! పోనీ అగ్గిపెట్టెల ధర అయినా తగ్గించారా? దయలేక ఒక కాణీకి నలభై పుల్లలు అమ్ముతున్నారు. ఇదివరకు అరవై ఎనభై ఒక్కొక్కప్పుడు వంద వుండేవి కాణీకి. ఇతనికి చుట్ట అలవాటు పాపం. అది కాలుస్తే కాని ఉషారుండదు నడవటానికి. దగ్గిర అగ్గి పుల్ల లేదు. అంచేత ఎలక్ట్రిక్ దీపానికి చుట్ట ముట్టిద్దామని ఒక స్తంభం ఎక్కాడు ఆ ఆసామి. చుట్ట నోట్లో పెట్టి దీపందగ్గరకి తీసుకు వచ్చాడు. అతనికి కొరివి దయ్యానిది గాజుగుడ్డు గుండ్రంగా అగుపించడంచేత హడిలిపోయి స్తంభం దిగిపోతున్నాడు. ఆ హడావిడిలో అతని చేతులు తీగెలకి తగిలి క్రిందికి వ్రేలాడు తున్నాడు. అతన్ని కొరివి దయ్యాలు లాగే స్తున్నాయని దగ్గరనున్న వెంకన్న సివన్న ఇంకా ఇద్దరు పరుగెత్తి అతని కాళ్లు పట్టుకొని లాగుతూ తమాషాగా గొలుసు లాగ వ్రేలాడుతున్నారు. చాలా మంది పోగయి "దయ్యాలు వీళ్ళని



చంపేశాయి. ఎన్ని చెప్పినా వినడు శాస్త్రి. ఇదంతా ఆయనవల్లే వచ్చింది'', అని శాస్త్రిని తన్నడానికి పరుగెత్తారు. శాస్త్రి 'మీకేమి భయంలేదు. నేను వాటితో చెప్పాను ఒకసారి. అవి జాగ్రత్తగానే ఉన్నాయి. వీళ్లు వాటి జోలికి వెడితే వాటికి కోపంరాదా మరి? నేను మళ్ళీచెప్పి కోపం పడతాను వాటిని. మీరు వెళ్ళండి' అని వాళ్ళని పంపేసాడు అతి ప్రయాసతోటి. వాళ్లు 'అవును వాళ్లు దయ్యాల జోలికి ఎందుకు వెళ్లాలి. అదీ నిజమే' అని వెళ్లిపోయారు.

శాస్త్రిగారి ముండ వెంకటలక్ష్మి ఆయన ఇంట్లోనే పెట్టింది మకాం దీపాలు రాగానే. ఒక రోజున రాత్రి 7 గంటలకి లక్ష్మి శయన గృహం అలంకరిద్దామని గదిలో స్విచ్చి నొక్కింది. స్విచ్చి పైడిప్ప ఏకారణం చేతో లేదు. ఆమె వ్రేళ్లు స్విచ్చిలో తీగలకు తగిలి షాక్ ఇచ్చింది. ఎప్పట్లాగే పోగయింది మూక. "మేము ఎన్నిసార్లు చెప్పినా వినలేదు మీరు. ఈ దయ్యం లక్ష్మిని కూడ చంపేసింది. ఇప్పుడైనా వీటిని తరివేయండి, లేకపోతే తంతాం" అని బడితెలు తీసుకొచ్చారు జనం. ఆవూళ్లో ఉన్న ఒక వృద్ధ పోలీసు జవాను "కొరివి దయ్యంచేత లక్ష్మిని చంపించేవుకదూ? ఠాణాకి నడువు" అంటూ తగులుకున్నాడు ఒకమూల. ప్లీడరు సుబ్బారావుగారు "నువ్వు అయిదు వందలు రూపాయలిస్తే కేసు తప్పిస్తా లేకపోతే కేసు తెచ్చి ఉరి వేయిస్తా" నంటూ తగులుకున్నాడు ఒకపక్క. బిల్లు కలెక్టరుగారొచ్చి 'ఏమయ్యా దీపాలకి ఖర్చు రూ. 60-12-4 లు అయింది. డబ్బంతా ఇప్పుడు ఇచ్చెయ్యాలి లేకపోతే దావావేసి ఇంట్లో సామానంతా వేలం వేయిస్తాం" అని కూర్చున్నాడు.

"నిజంగా ఇవి కొరివి దయ్యాలురా బాబు. ఇవి చమురు ఎక్కువగా పీల్చుకుంటున్నాయి. అందుకనే వాటి కళ్లు, పూర్వకాలం కొరివి దయ్యాల కళ్ళకంటె, తెల్లగా పెట్రోమేక్సిమ్ దీపంలాగ వెలుగుతున్నాయి. మొన్నమా ఇంటిపక్క గోవిందరాజు గారింట్లో పెట్రోమేక్సిమ్ దీపం ఇలాగే ఉంది. కిరసనాయిలు అయితే నెలకు ఒకరూపాయి అవుతుంది. ఇవి అయితే రూ. 60-12-4 లు మింగేసాయి. నిజంగా ముమ్మాటికి ఇవి కొరివి దయ్యాలే. నిష్కారణంగా మా లక్ష్మిని ఆ మనుష్యుల్ని చంపేసాయి ఇవి. నిజంగా ఇవి ఎలక్ట్రిక్ దీపాలైతే తీగిలు ముట్టుకున్నంత మాత్రాన్నే చస్తారా ఎవరైనాను. అంచేత వీటిని పంపించేద్దాం" అని కలక్టరుగారితో "ఏమయ్యా మీకు బుద్ధి ఉందా లేదా? ఎలక్ట్రిక్ అని చెప్పి కొరివి దయ్యాల్ని పంపించారు మా ఊరు. పైగా అరవై పైచిలుకు డబ్బు లాగుతున్నారు. మాకు అక్కరలేదు ఇవి'' అని చెప్పి వాటిని ఆ ఊళ్లోంచి తరి వెయ్యమన్నాడు శాస్త్రి. సరే అని కలక్టరుగారు ఫర్నిచరుతో కూడ వాటిని తీసుకుపోయారు. ఆ రోజునుంచి కొరివిదయ్యాలు ధవిళేశ్వరంలోంచి ఎత్తేశాయి. మకాంపురజనుల అదృష్టంవల్ల. కొరవి దయ్యాల బాధ తగ్గి సుఖంగా ఉన్నారు పురవాసులు. కాని కొన్ని రోజులలో వాటిని తరిమి వేశారన్న కోపంచేత అవి కొంత దండును తీసుకొని ధవిళేశ్వరం మీదకు దండెత్తుదామని ప్రయత్నిస్తూన్నట్టు నాకు తెలిసింది. కనుక ఈ 'వినోదిని' అనే వార్తాహారిణిద్వారా తెలియజేసేను.